క్లుప్తంగా

నేటి నుంచి భాగవత పారాయణ మహాయజ్ఞం

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 24 వరకు శ్రీమద్ భాగవత సప్తాహ పారాయణ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు జరిగే మహాయజ్ఞ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లా వికాస తరంగిణి, విశ్వహిందూ పరిషత్, ధర్మ ప్రసార సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కావునా భాగవత సప్తాహకులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మహిళా శక్తి సంబురాలు



అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ రైతు వేదికలో మహిళా సంఘాల అధ్వర్యంలో బుధవారం మహిళా శక్తి సంబురాలు ఘనంగా నిర్వహించారు. నూతన సంఘాలు, వికలాంగుల సంఘాలు, కొత్త ఎంటర్‌ప్రైజెస్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2025- 26 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటేష్‌ను మహిళలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎం అరుణ, సలోమి, రుతమ్మ, ఎల్లప్ప, ఏపీఎం ప్రవీణ, పీహెచ్‌సీ డాక్టర్ భరత్, సీసీలు జయమ్మ, సునంద, ఆధాకర్‌నాయుడు, లావణ్య, రియాజ్ బేగం, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు భవనాన్ని కేటాయించాలి

రాజోళి: మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని సీపీఎం కార్యదర్శి విజయ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో ప్రభుత్వ బడిగా ఉన్న భవనాన్ని మండల ఏర్పాటు అనంతరం వ్యవసాయ కార్యాలయానికి ఇచ్చారన్నారు. కార్యాలయ కలపాలు ప్రస్తుతం రైతు వేదికలో నిర్వహిస్తున్న క్రమంలో ఈ భవనాన్ని పాఠశాలకు కేటాయించాలన్నారు. ఎంపీపీఎస్ పాఠశాలలో గదుల కొరత వల్ల ఆరుబయటే పాఠాలు బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థినికి సన్మానం



గట్టు: మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మండల టాపర్(529) గా నిలిచిన విద్యార్థిని ఇంద్రజను బుధవారం మాజీ ఉప సర్పంచ్ ఉరుకుందు, టీడీపీ రాముడు ఘనంగా సన్మానించారు. అనంతరం రూ.5,016 పోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రఘు, మాజీ సర్పంచ్ పద్మావతి, నర్సింహులుగౌడు, జంపన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సామాజిక ఆర్థిక సర్వే



అమరచింత: మున్సిపాలిటీలో బ్యాంకు ద్వారా రుణం పొంది వీధి విక్రయదారులుగా వ్యాపారం సాగిస్తున్న వారిని కలిసి సామాజిక ఆర్థిక సర్వే చేపడుతున్నామని మెప్మా కో ఆర్డినేటర్ యువరాజు తెలిపారు. పురపాలిక కార్యాలయంలో బుధవారం వీధి విక్రయ రుణాలను పొందిన వారి కుటుంబసభ్యుల సమాచారంతో పాటు ఆర్థికసర్వే నిర్వహించినట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలతో విక్రయదారుడి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. రుణం తీసుకుని ప్రమాదవశాత్తు విక్రయదారుడు మృతి చెందితే వారి వ్యాపారం కుంటుపడకుండా ఆదుకోనే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఏడాదికి రూ.456 వ్యక్తిగతంగా స్ట్రీట్ వెండర్ పేరిట పీఎం బీమా సురక్ష, జీవన్‌జ్యోతి పథకాలు ఆపదకర సమయాల్లో రూ.2లక్షల బీమా వస్తుందన్నారు. పట్టణంలో మొత్తం 632మంది రుణాలను పొందారని మొదటిరోజు 105 మందిని కలిసి వివరాలను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- వేధిస్తున్న గదుల కొరత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 23ఏళ్ల క్రితం నిర్మించిన ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా ఉండటంతో రోగులు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సేవలు బాగానే ఉన్నా గదుల కొరత, నీటి సమస్య కారణంగా నానా అవస్థలు పడుతున్నట్లు రోగులు, గర్భిణులు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆవరణలో పశువుల సంచారం

ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు



గదుల కొరత కారణంగా చెట్ల కింద నిర్వహిస్తున్న సమావేశం(ఫైల్)

సంచరిస్తూ ఆవరణను అపరిశుభ్రంగా తయారు చేస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రహరీ లేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న నీటి సమస్య

ఆస్పత్రిలో ప్రధానంగా నీటి సమస్య వెంటాడుతోంది. రెండు మూడు రోజులకోసారి కూడా నీరు రావడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉండటంతో నీటి కోసం తిప్పలు పడుతున్నట్లు వాపోతున్నారు.

గదుల కొరతతో అవస్థలు

ఆస్పత్రిలో రోగులతో పాటు వైద్య సిబ్బందికి వసతి గదులు లేకపోవడంతో పాటు ప్రసూతిగదిలో సరైన వసతులు లేకపోవడం గమనార్హం. అలాగే ప్రతి నెల వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలకు గదులు లేక ఆస్పత్రి ఆవరణలో చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అదే విధంగా గదుల కొరత కారణంగా గర్భిణులను ప్రసవం అయిన వెంటనే ఇళ్లకు వెళ్లాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడంతో గద్వాల ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.ఆస్పత్రికి వచ్చే రోగులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీగోడ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. రెండు మూడు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి.

- అంజిగౌడ్, మల్దకల్

గదుల సంఖ్య పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడ గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో అయితే ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

- సవారమ్మ, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. ముఖ్యంగా గదుల కొరత, నీటి సమస్య వేధిస్తోంది. సమావేశాలు కూడా చెట్ల కింద నిర్వహించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- స్వరూపరాణి, వైద్యురాలు, మల్దకల్

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న రజక సంఘం నాయకులు

గట్టు: మండల పరిధిలోని బోయలగూడెం గ్రామంలో అగ్నిప్రమాదం కారణంగా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా గుడిసెకు మంటలు అంటుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి అగ్నికి ఆహుతైనట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు చాకలి శాంతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాటి నర్సింహ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గ్యాస్ కంపెనీ బీమా పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ అంజి, నర్సింహులు, కోట్ల వీరేష్, బోయలగూడెం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ అవార్డుల నివేదిక ఇవ్వాలి



అమరచింత: ఉత్తమ పంచాయతీలకు ఎంపిక చేసేందుకు ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీరాం రెడ్డి కోరారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో జరిగే ఉపాధి పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, విద్యాబోధన, అంగన్‌వాడీల పనితీరు, పోలీసు క్రైం రేటు, వైద్యసేవలతో పాటు ఇతర కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయనే విషయాలపై నివేదికను సేకరించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణ, ఎంపీఓ నరసింహులు పలువురు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ



మునగాలలో రోడ్డుపై నిలిచిన మురుగు

ఇటిక్యాల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండల పరిధిలోని మునగాల గ్రామంలో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్లపై పారుతుండటంతో కాలనీలు కంపుకొడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి రూరల్: చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఆయన శ్రీరంగాపురంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు టీకాలు వేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాల సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాలని సూచించారు. వందశాతం పిల్లలకు టీకాలు వేయాలని, వారి సమాచారం అంతర్జాలంలో నమోదు చేయాలని, డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలన్నారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. పిల్లలకు పాఠశాల దశనుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన కృత్రిమమేధస్సు(ఏఐ) శిక్షణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సమస్య లేకుండా నాణ్యమైన కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హెడ్‌సెట్ తప్పకుండా వాడాలన్నారు. ప్రతివిద్యార్థికి యుజర్ ఐడీ ఎవరి ఐడీ వారు వాడేవిధంగా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రశ్నలను సంధించి సమాధానాలు రాబట్టారు. గణితంలో మంచిపట్టు సాధించే దిశగా బోధించాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ టీటీ ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంగా ఉండాలి



ఆత్మకూర్: పురపాలికలో పనిచేస్తున్న కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని అనారోగ్యాలకు గురికాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, కార్మికులతో సమావేశమయ్యారు. నెషనల్ యాక్షన్ ఫర్ మెకానైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టం పథకంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను అందజేశారు. పట్టణ పరిశుభ్రతనే లక్ష్యంగా వార్డుల అధికారులు, కార్మికులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. వార్డులో సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యూకేటర్ సురేందర్‌గౌడ్, అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాషన్న, ముబ్బషీర్ తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని రక్షించేందుకే కార్బన్ క్రెడిట్



మాట్లాడుతున్న ఏపీఓ శివజ్యోతి

ఎర్రవల్లి: పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాల వల్ల కలుషితమవుతున్న పర్యావరణాన్ని రక్షించేందుకే ప్రభుత్వం కార్బన్ క్రెడిట్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఏపీఓ శివజ్యోతి అన్నారు. బుధవారం ఉమ్మడి ఇటిక్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆమె హాజరై కార్బన్ క్రెడిట్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పరిశ్రమల ద్వారా వచ్చే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు గాను మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం ద్వారా విరివిగా మొక్కలను నాటి పెంచితే లబ్ధిదారులకు వేతనం వస్తుందన్నారు. మొక్కల నుంచి వెలువడే ఆక్సిజన్, మొక్కల కెపాసిటీని బట్టి కొన్ని సంస్థల ద్వారా ప్రభుత్వ సహాయంతో తగిన వేతనం చెల్లిస్తారని సూచించారు. ప్రస్తుతం స్థానిక నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తి గలవారు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో జీపీ కార్యదర్శులు, టీఏలు గ్రామ సభలు నిర్వహించి రైతులకు కార్బన్ క్రెడిట్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఏలు, జీపీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ క్రీడాకారుడికి ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

గద్వాలటౌన్: సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సోమనాద్రి స్టేడియంలో ఏర్పాటు చేసిన సంజీవయ్య చిత్రపటానికి డీవైఎస్ఓ జితేందర్ జితేందర్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, వివిధ క్రీడా సంఘాల క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు క్రీడాకారులకు ఉచితంగా ఫుట్‌బాల్ కిట్లు, అసోసియేషన్ తరఫున హమాలీ కార్మికులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బండల పాండు, సీనియర్ క్రీడాకారులు జగన్, తిరుమల్, ప్రశాంత్‌గౌడ్, రాజారెడ్డి, ఝూడే శ్రీను, నల్లన్న, హరిగౌడ్, హలీం పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థినులకు బుధవారం వైద్యాధికారి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుపై ప్రత్యేక దృష్టిని సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ గోపిలత, హెల్త్ అసిస్టెంట్ వెంకటస్వామి, ఏఎస్ఎం తాహేర్, ఆశా వర్కర్ యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి



రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలో ప్రధాన రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాల వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని తొలగించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో బీజేపీ నాయకులు పర్యటించారు. కొత్త బస్టాండ్ వద్ద ప్రధాన రోడ్డుపై అనేక స్తంభాలు ఉన్నాయన్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న స్తంభాలను తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, అశోక్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

మల్దకల్: గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలందరిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యం నెరవేరేనా ?

- ముఖం చాటేసిన వర్షాలు
- పలు నర్సరీల్లో ఎదగని మొక్కలు
- గ్రామాల్లో తీయని గుంతలు



మానవపాడు నర్సరీలో పెంచిన మొక్కలు

మానవపాడు/కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమ లక్ష్యం నెరవేరేలా లేదు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాల పరిధిలోని ఆయా మండలాల్లో వర్షాలు ముఖం చాటేయడంతో మొక్కలు నాటే కార్యక్రమం ఆలస్యమవుతుంది. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో వన నర్సరీల్లో మొక్కలు సరిగా ఎదగలేదు. నెట్‌షెడ్లు వేయని చోట మొక్కలు వాడిపోతూనే ఉన్నాయి.

కేటీదొడ్డి మండల పరిధిలో..

కేటీదొడ్డి మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా ఈ వర్షాకాలం సీజన్‌లో వనమహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో 5000 మొక్కలు చొప్పున మండల వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలని అధికారులు చర్యలు చేపట్టారు. కాగా ఇప్పటి వరకు మండలంలో అక్కడక్కడ మాత్రమే మొక్కలు నాటారు. మండలంలోని ఏ గ్రామంలో పూర్తిస్థాయిలో గుంతలు కూడా తీయని పరిస్థితి నెలకొంది. శిఖం భూములు, చెరువు కట్టలపై నాటే మొక్కలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నర్సరీల్లో ఇంటి ఆవరణలో నాటేందుకు సరైనా పండ్ల, పూల మొక్కలు టేకు, దిగిన మొక్కలను సైతం అధికారులు ఇప్పటివరకు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయలేదు.



సోంపురంలో నర్సరీలో ఎదగని మొక్కలు

మానవపాడు మండలంలో..

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 2025–26లో వన మహోత్సవంలో భాగంగా మొత్తం 64వేలు మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని వన నర్సరీల్లో పండ్లు, పూలు మొక్కలు సిద్ధం చేశారు. వర్షాలు కురవక పోవడంతో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కాలేదు. వర్షాలు ముఖం చాటేసిన నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా అని ఆయా మండల ప్రజలు పేర్కొంటున్నారు.

లక్ష్యం సాధిస్తాం..

ఆయా మండలాల పరిధిలోని వర్షాలు సమృద్ధిగా పడిన గ్రామాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో గ్రామానికి వెయ్యి నుంచి 4 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏది ఏమైనా వనమహోత్సవం లక్ష్యం చేరుకుంటామని పేర్కొంటున్నారు.

విరివిగా మొక్కలు పెంచాలి



గ్రామాల్లో మొక్కలు నాటిన నాటి నుంచి అధికారులు పర్యవేక్షణ ఉండాలి. పాఠశాల, కళాశాలలు, దేవాలయాలు, రోడ్డు పక్కన మొక్కలను పెంచాలి. క్షేత్రస్థాయిలో మొక్కలు సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- చిన్న వెంకట్రాముడు, మానవపాడు

పంపిణీ చేయలేదు



ప్రతి వర్షాకాలం సీజన్‌లో ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేసేవారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొక్కలు పంపిణీ చేయలేదు. గ్రామంలోని నర్సరీల్లో ఏ మొక్కలు ఉన్నాయో తెలియడం లేదు. అధికారులు మొక్కల పంపిణీకి చర్యలు చేపట్టాలి.

- చిన్నరాములుగౌడ్, కేటీదొడ్డి

లక్ష్యాన్ని సాధిస్తాం..



మండల పరిధిలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తీయిస్తున్నాం. పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. వర్షాలు కురవని నేపథ్యంలో మొక్కలు నాటడం ఆలస్యమవుతుంది.

- కృష్ణమోహన్, ఎంపీడీఓ, కేటీదొడ్డి